# రైతులు చెబుతున్నది నిజమే - వారి భూమి పందెంలో ఉంది

**జనవరి 26, 2021 రూపే ఇండియా రచన - మొదటి భాగము**

**అనువాదం: పరుచూరి జమున**

ఢిల్లీ సరిహద్దుల్లో నిరసన తెలిపే రైతులు ఒక విషయం పదే పదే చెబుతుంటారు: కేంద్రం తెచ్చిన మూడు వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా పోరాడటమంటే తమ భూమిని కాపాడుకోవడానికి చేస్తున్న పోరాటమనని .... "చూడండి, వాళ్లు - అదానీ, అంబానీ, కార్పొరేట్ సంస్థలు...మా భూమిని స్వాధీనం చేసుకోవాలనుకుంటున్నారు." అని ఒక యువ నిరసనకారుడు చెప్పాడు. అతని జీవితం చక్రాల బండికి (వీల్ ఛైర్) అతుక్కుపోయి ఉన్నప్పటికీ పంజాబ్ నుండి ఢిల్లీకి నిరసనలో పాల్గొనడానికి వచ్చాడు. ఒక ముదుసలి రైతు, నిరసనకారుల సామూహిక వంటగది కోసం బఠానీలను వలుస్తూ ఇలా ప్రకటించాడు: "బ్రిటిష్ వారు మన భూమిని స్వాధీనం చేసుకున్నారు. మనం వారిని దూరంగా తరిమి కొట్టాం. మనం ఇప్పుడు కూడా అదే పని చేయాలి. మేము వారిని దూరంగా తరిమి కొట్టేవరకు విశ్రాంతి తీసుకోనేదిలేదు." ఇంకా రైతులను తప్పుదారి పట్టించారని ప్రకటించడంలో అధికారులు ఏకగ్రీవంగానే ఉన్నారు. వారి భూమికి ముప్పు లేదు గదా.

- 2020 డిసెంబర్ 15 న ప్రధాని ఇలా ఉద్ఘాటించారు: "ఢిల్లీలో, ఢిల్లీకి సమీప ప్రాంతాలలో రైతులను తప్పుదారి పట్టించడానికి భారీ కుట్ర జరుగుతోంది. కొత్త వ్యవసాయ సంస్కరణల తరువాత ఇతరులు రైతుల భూమిని ఆక్రమించుకుంటారని వారు బెదిరిస్తున్నారు. సోదర సోదరీమణులారా ! పాల కోసం మీతో ఒప్పందం కుదుర్చుకున్న ఏ పాడి పరిశ్రమ యజమాని అయినా మీ పశువులను తీసుకెళ్తారా? పండ్లు, కూరగాయలు వ్యాపారం చేసే వారి భూమిని ఎవరైనా లాక్కొని పోతారా ? అని నేను మీ నుండి తెలుసుకోవాలనుకుంటున్నాను."
- "నరేంద్ర మోడీ దేశ ప్రధానిగా ఉన్నంతవరకు ఏ కార్పొరేట్ కూడా రైతుల భూమిని లాక్కోదు " అని హోం మంత్రి అమిత్ షా డిసెంబర్ 25 న ప్రకటించారు.
- "కాంట్రాక్టు వ్యవసాయం కోసం ఏ రైతు తన భూమిని అమ్మకుండా మేము మధ్యంతర ఉత్తర్వులు జారీ చేస్తాము" అంటూ 2021 జనవరి 12 వ తేదీన భారత ప్రధాన న్యాయమూర్తి రైతులకు హామీ ఇచ్చారు. ప్రభుత్వం తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది హరీష్ సాల్వే కోర్టుకు ఇలా తెలియజేశారు: "అటార్నీ జనరల్, సొలిసిటర్ జనరల్ కూడా ఈ ఆందోళనలు నిరాధారమైనవని భరోసా ఇవ్వగలరు.... ఏ భూములు అమ్ముకోబడవు. " ప్రభుత్వ అత్యున్నత విధాన రూపకల్పన సంస్థ - నీతి ఆయోగ్, 2020 నవంబర్ మాసంలో ఒక పత్రాన్ని తయారు చేసింది. అందులో "కార్పొరేట్‌లు రైతుల భూములను స్వాధీనం

చేసుకోవడం లేదా ఒప్పందాన్ని మోసపూరితంగా మార్చడం ద్వారా రైతుల ఆస్తులను బలవంతంగా లాక్కొంటారన్న భయాలు పూర్తిగా అపభ్రంశాలు" అని ప్రకటించింది.

- వాస్తవానికి భూమి కబ్జాదారులుగా ఆరోపణలను ఎదుర్కొంటున్న వారే - రిలయన్స్ ఇండస్ట్రీస్ స్వయంగా 2021 జనవరి 4 వ తేదీన ఒక పత్రికా ప్రకటనను విడుదల చేసింది: “రిలయన్స్ లేదా మా అనుబంధ సంస్థలు ఏవీ వ్యవసాయ భూమిని ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా పంజాబ్ / హర్యానా రాష్ట్రాల్లో లేదా భారతదేశంలో మరెక్కడా 'కార్పొరేట్' లేదా 'కాంట్రాక్ట్' వ్యవసాయం కోసం కొనుగోలు చేయలేదు. భవిష్యత్తులో అలా చేసే ప్రణాళికలు కూడా మాకు ఖచ్చితంగా లేవు. "

## తొలుత దాపరికం తరువాత పాలకుల ప్రకటనలు

నిజమే, కొద్ది నెలల క్రితం పాలకులే స్వయంగా ఈ విషయాన్ని కార్పొరేట్ పెట్టుబడిదారులకు ప్రకటించి చెప్పడానికి ఆసక్తి చూపారు. "కరోనా ప్యాకేజీ" ను ప్రకటిస్తూ 2020 మే 12 వ తేదీన మోడీ తన ప్రసంగంలో ఇలా అన్నారు: " భారతదేశాన్ని స్వావలంబన కలిగిన దేశంగా నిరూపించడానికి భూమి, కార్మికులు, ద్రవ్యచలామణి తదితర చట్టాలన్నింటిని ఈ ప్యాకేజీలో ఉద్ఘాటించాము." ఆయన ఏ "భూమి" ని గురించి మాట్లాడారు?

రెండు రోజుల తరువాత ప్రధాన ఆర్థిక సలహాదారు కృష్ణమూర్తి సుబ్రమణియన్ వీటిని ప్రధాని ఏ అర్థంతో చెప్పారో వివరించారు: “భూమి, శ్రమ మార్కెట్ సంస్కరణలకు నిజమైన కారకాలు [ ఆర్థిక శాస్త్రం పాఠ్యపుస్తకంలో భూమి, శ్రమ, మూలధనం ఈ మూడింటిని 'ఉత్పత్తి కారకాలు'గా బోధిస్తారు - రూపే] ఎందుకంటే ఇవి వ్యాపారం చేసే వ్యయాన్ని నిజంగా ప్రభావితం చేసే కారకాలు - పెట్టుబడులు. మీరు ఇటీవల ప్రభుత్వ స్థాయిలో వీటిపై చాలా మార్పులను చూసి ఉంటారు. ఏమయితేనేం, కొంచెం లోతుగా పరిశీలిస్తే రైతుల భయాలు సరైనవేనని స్పష్టమవుతుంది. చివరికి పందెంలో ఉన్నదేమిటి - వారి భూమినే. ఈ మూడు చట్టాలు ఒక పెద్ద విధానంలో అంతర్భాగం. దీని ఫలితంగా రైతులు తమ భూమి నుండి విడిపోతారు. ఉత్తర ప్రదేశ్, మధ్యప్రదేశ్, గుజరాత్ రాష్ట్రాలు ప్రాథమిక కార్మిక సంస్కరణలను ప్రకటించాయి. ఇతర రాష్ట్రాలు కూడా అదే దారిని అనుసరించడానికి సిద్ధంగా ఉన్నాయి.... కర్ణాటక ఇంకొంచెం ముందుకు వెళ్లి వ్యాపారం కోసం భూమిని స్వాధీనం చేసుకునే నిబంధనను కూడా మార్చింది. ఇప్పుడు ఆ రాష్ట్రంలో రైతుల నుండి నేరుగా భూమిని కొనుగోలు చేయవచ్చు. ఇతర రాష్ట్రాలు కూడా ఇదే నమూనాను అనుసరిస్తాయి.”

కర్ణాటకలోని పాత భూసంస్కరణ చట్టం ప్రైవేట్ వ్యాపారం ద్వారా నేరుగా భూమిని స్వాధీనం చేసుకోకుండా నిరోధించింది. బలవంతంగా, మోసంతో రైతులనుండి భూమిని తీసుకోకుండా ఈ చట్టం వారికి రక్షణగా ఉండేది. 2020 డిసెంబర్‌లో ఈ రక్షణ [1] తొలగింపు చర్యను వెంటనే పెద్ద పెద్ద వ్యాపారవేత్తలందరు స్వాగతించారు.

దీనికి అనుగుణంగానే  కరోనా సంక్షోభం తీవ్రస్థాయిలో ఉన్నప్పుడు  మోడీ ప్రభుత్వం రెండు చర్యలను ప్రారంభించింది: గ్రామీణ ప్రాంతాల్లోని అన్ని నివాస ప్రాంతాలను  డ్రోన్ ఆధారంగా  మ్యాపింగ్ చేయడం;  రాష్ట్రాలు అమలు చేసేందుకు  - భూమి ఎవరిదో వారి పేరుమీదికి ఖచ్చితంగా నమోదు చేయడం కోసం ఒక నమూనా చట్టం తయారీ.  మనము ఈ దశలను గురించి చర్చించే ముందు ఈ వ్యాసం లోని  వాదనను క్లుప్తంగా తెలుసుకొందాము.

---


సారాంశం

(1) గత రెండు దశాబ్దాలుగా అంతర్జాతీయ సంస్థలు,  భారత ప్రభుత్వం పేద రైతుల భూములను బదిలీ చేయడానికి అవసరమైన భూమిక తయారీకి నిర్దిష్టంగా సిద్ధమవుతున్నాయి. "తమ భూములు చాలా చిన్నవిగా తమ జీవనోపాధికి చాలడం లేదని"  భావించే రైతుల కోసం "శక్తివంతమైన భూముల అమ్మకాల మార్కెట్ల"ను సృష్టించడంగా వారు దీనిని పేర్కొన్నారు.

(2) ఈ లక్ష్యాన్ని సాధించే నిమిత్తం  దేశంలోని అన్ని భూములకు పట్టాలను  సృష్టించే  'నిశ్చయాత్మకమైన టైటిలింగ్' (conclusive titling) వ్యవస్థను ఏర్పాటు చేయడానికి భారత ప్రభుత్వం ప్రయత్నిస్తోంది.  దీని ద్వారా ఇతర హక్కుదారులకు వ్యతిరేకంగా పట్టాదారుకు గుర్తింపును ఇచ్చి  రాష్ట్రం  శాశ్వతంగా హామీ ఇస్తుంది. నీతి ఆయోగ్ ఇందుకనుగుణంగా  'నిశ్చయాత్మక టైటిలింగ్'  నమూనా బిల్లును తయారుచేసి,  ఆ బిల్లును ఆమోదించవలసిందిగా  రాష్ట్ర ప్రభుత్వాలను ఒత్తిడి చేస్తోంది.

(3) మన దేశంలో భూమి అతిపెద్ద ఏకైక జీవనోపాధిగా, జీవనాధారంగా  కొనసాగుతోంది.  దానిపై అనేకమైన, చారిత్రాత్మకంగా ఏర్పాటైన,  హక్కుదారులమనే వాదనలు ఉన్నాయి. వీటిని కేవలం పరిపాలనాపరమైన అంశంగా కాకుండా సామాజిక ప్రక్రియ ద్వారా సంతృప్తి కరంగా  నిర్ణయించాలి.  ప్రస్తుతం చాలా వేగవంతంగా సాగుతున్న భూమి హక్కుదార్ల పేరు నమోదు కార్యక్రమం,  భూముల రికార్డులను డిజిటలైజ్ చేయడం వలన  చాలా ముఖ్యమైన గ్రామీణ ఉత్పత్తి,  జీవనాధారాల నుంచి  పేద రైతులను బయటకు  తరిమికొట్టే ప్రమాదం ఉంది.

(4) ఈ ప్రక్రియ వాస్తవానికి నడుస్తున్నది పేద రైతుల అవసరాల రీత్యా  కాదు, ఎక్కడో మారుమూల ప్రాంతాల నుండి, భారతీయ భూములకు సంబంధించిన పెట్టుబడి నిర్ణయాలు తీసుకోగలగే విధంగా అంతర్జాతీయ,  దేశీయ కార్పొరేట్ పెట్టుబడిదారుల అవసరాలు తీర్చేందుకు ఈ ప్రక్రియ నడుస్తున్నది.

(5) ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో కొనసాగుతున్న మార్పులు, పెరుగుతున్న అనిశ్చితులు, అలాగే ప్రపంచ శీతోష్ణ స్థితి, వాతావరణంలో వస్తాయని ఊహించిన మార్పులు -   అంతర్జాతీయ వ్యవసాయ వ్యాపార వేత్తలను,  ఆర్థిక

పెట్టుబడిదారులను మూడవ ప్రపంచ దేశాల్లో వ్యవసాయ భూములతో సహా భూమిపై నియంత్రణ సాధించడానికి పురికొల్పాయి. అదే సమయంలో, నయా ఉదారవాద యుగంలో, మూడవ ప్రపంచ ఆర్థిక వ్యవస్థలు విదేశీ పెట్టుబడులకు మరింతగా ద్వారాలు బార్ల తెరచి పట్టుకొని స్వయంగా ఆహ్వానిస్తున్నాయి. ఈ క్రమంలోనే వ్యవసాయ భూమిపై కార్పొరేట్ కంపెనీలు, విదేశీయులు యాజమాన్యం కలిగి ఆ భూమి స్వంతదారులుగా ఉండటంపై ప్రస్తుతం ఉనికిలో ఉన్న చట్టపరమైన పరిమితులను దశలవారీగా రద్దు చేస్తున్నాయి.

అటువంటి ప్రపంచ ధోరణి - వ్యవస్థీకృత రిటైల్ వృద్ధిగా, సాధారణంగా విదేశీ పెట్టుబడులతో ముడిపడి ఉంటుంది. ఇది మొత్తంగా "అభివృద్ధి చెందుతున్న దేశాల్లోని స్వదేశీ ఆహార వ్యవస్థలను కార్పొరేట్ లు స్వాధీనం చేసుకోవడానికి" దారితీస్తుంది. [2] ఈ ప్రక్రియ మూడవ ప్రపంచ దేశాల వ్యవసాయాన్ని - దేశీయ వినియోగం కోసం అవసరమైన ప్రధాన పంటలకు దూరంగా, తాజా పండ్లు, కూరగాయలు, ఇతర ఉత్పత్తుల వైపు మళ్ళిస్తుంది. అభివృద్ధి చెందిన ప్రపంచ దేశాల అవసరాలకోసం, మూడవ ప్రపంచ దేశాల లోని స్థానిక ఉన్నత వర్గాల వారి కోర్కెలు తీర్చడానికి ఈ వ్యవసాయం సాగుతుంది. దేశీయ ఆహార భద్రతా వ్యవస్థలను కుప్పకూల్చుతుంది. అభివృద్ధి చెందిన దేశాల నుండి ఆహార ధాన్యాల దిగుమతులపై మూడవ ప్రపంచ దేశాలు ఆధారపడతాయి. (అభివృద్ధి చెందిన దేశాలు ఈ ధాన్యాలను స్వంత అవసరాలకు మించి అధిక మిగులును కలిగి ఉంటాయి). మూడవ ప్రపంచ దేశాల వ్యవసాయ రంగాల్లో విదేశీ, స్వదేశీ కార్పొరేట్ పెట్టుబడిదారులు చొచ్చుకుపోవటంతో భూమి చాలా తక్కువమంది అధీనంలో "కేంద్రీకృతమవుతుంది. విదేశీయుల హస్తగతమవుతుంది." అంటే భూమి "కేంద్రీకరణకు విదేశీకరణకు" గురవుతుంది. [3]

(6) భారతదేశ వ్యవసాయ రంగంలో మూడు దశాబ్దాల పాటు సాగిన నయా ఉదారవాద వ్యవస్థ (నియోలిబరల్ ) పునర్నిర్మాణం తీవ్రమైన సంక్షోభానికి దారితీసింది. ఇది 1990 దశకం చివరి నుండి మూడు లక్షలమంది రైతుల ఆత్మహత్యలతో అత్యంత ఘోరంగా వెల్లడైంది. వారి వ్యవసాయం ద్వారా వచ్చిన ఆదాయం వారి దైనందిన వినియోగ అవసరాలను కూడా తీర్చలేకపోవడంతో పేద రైతాంగాన్ని పిండేసినట్లయిందని అధికారిక సమాచారం వెల్లడించింది. [4] అదే సందర్భంలో వారు తమ భూమిని వదులుకోవడానికి దాని నుంచి విడిపోవడానికి ఇష్టపడలేదు. ఇంత మొండి పట్టుదలతో ప్రతిఘటించడానికి కారణం ఇతర రంగాల్లో సురక్షితమైన జీవనోపాధులు ఉద్భవించలేదని (వాస్తవానికి, కనుమరుగవుతున్నాయని) వారికి తెలవడమే. భూమి, అందుబాటులో ఉన్న ఉమ్మడి వనరులు ఇప్పటికీ రైతు కుటుంబానికి కొంత జీవనాధారాన్ని కల్పిస్తున్నాయన్న జ్ఞానం వారికి ఉండటం వల్లనే ప్రతిఘటించగలుగుతున్నారు.

ఏదేమైనా భారతదేశ ఆహార వ్యవస్థను కార్పొరేట్ వర్గాలు స్వాధీనం చేసుకొంటే అది భారత రైతాంగంలోని వివిధ సెక్షన్ల ప్రజలని అనేక రకాలైన వత్తిడికి గురిచేస్తుంది. ప్రభుత్వ సేకరణను మూసివేయడం వలన వ్యవసాయ

క్షేత్రాల (పొలాల) వద్ద ఆహార ధాన్యాల ధరలు తగ్గుతాయి. సేకరణ ప్రాంతాల్లోని సాగుదారులు వారి వినియోగ వ్యయాలకు సరిపోయేవిధంగా కార్పొరేట్లు కోరిన పంటలు పండించడానికి పంట మార్పిడులు చేయక తప్పని స్థితి ఏర్పడుతుంది. కానీ వ్యవస్థీకృత రిటైల్ వ్యాపారులు, ఎగుమతిదారులు కోరిన ప్రత్యేక గుర్తింపులు గల పంటలను పండించడం, అటువంటి పంటలకవసరమైన పెట్టుబడులు సమకూర్చుకోవడం ఈ చిన్న ఉత్పత్తిదారులకు సాధ్యంకానివి. ప్రజా పంపిణీ వ్యవస్థను (PDS ) మూసివేయడం వలన గిరిజన ప్రాంతాలతో సహా ఇతర ప్రాంతాలలో రైతుల వినిమయ ఖర్చులు పెరిగిపోతాయి. ఈ పోకడలన్నీ రైతాంగంలోని వివిధ వర్గాల రుణ సంక్షోభాన్ని తీవ్రతరం చేస్తాయి. రైతులు తమ భూములను వదులు కోవాల్సిన స్థితికి దారి తీస్తాయి.

రైతులను తప్పుదారి పట్టించలేదు. రైతులు ఈ ప్రక్రియను తమ దీర్ఘకాలిక ప్రయోజనం దృష్ట్యా ప్రతిఘటిస్తున్నారు. దేశ ప్రయోజనాల దృష్ట్యా ఆహార భద్రతను, దేశంలోని భూమిని రక్షించుకోవాలి. ఈ పోరాటం బ్రిటిష్ పాలన కింద భారతదేశ రైతాంగం చేసిన వీరోచిత పోరాటాలకు ప్రత్యక్ష వారసత్వం వహిస్తున్నది.

---

మనం ఇప్పుడు పైన పేర్కొన్న విషయాల వివరణలోకి వెల్దాము.

లక్ష్యం: “శక్తివంతమైన భూమి అమ్మకాల మార్కెట్లను” సృష్టించడం

నయా ఉదారవాద ‘సంస్కరణ’ ప్రక్రియ ముఖ్య అంశాలలో ఒకటి భూమిపై నియంత్రణను బదిలీ చేయడం. అందరికీ తెలిసిందే, మోడీ ప్రభుత్వం తన మొదటి పదవీకాలంలో రైతుల ప్రయోజనాలకు విరుద్ధంగా, భూమిని బలవంతంగా స్వాధీన పరుచుకోవడానికి అనుకూలంగా - అంతకుముందు ప్రభుత్వం చేసిన భూసేకరణ, పునర్వ్యవస్థీకరణ , పునరావాస చట్టం, 2013 [5] లోని వివిధ నిబంధనలను నీరుగార్చడానికి, వీలైతే మొత్తంగా తొలగించడానికి ప్రయత్నించింది.

రైతు సంఘాలు, పార్లమెంటరీ పార్టీల వ్యతిరేకత నేపథ్యంలో పాలకులు ఈ సవరణ ప్రయత్నాన్ని విరమించుకోవలసి వచ్చింది, కాని పాలకులు దానిని తిరిగి తీసుకురావాలని యోచిస్తున్నారు: ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి (పిఎంఇఎసి) మాజీ సభ్యుడు ప్రకారం, “ నవంబర్ 2020 నుండి కొంచెం సదుపాయంగా ఉంటుందని అధికార పార్టీ భావిస్తున్నందున, భూమి బిల్లును మళ్ళీ ప్రవేశపెట్టాలని అనుకొంటున్నారు. ”[6]

ఏదేమైనా, రైతులను వారి భూమి నుండి వేరు చేసే ప్రక్రియ పారిశ్రామిక, మౌలిక సదుపాయాల, మైనింగ్ లేదా రియల్ ఎస్టేట్ ప్రాజెక్టుల కోసం భూమిని సంపాదించడానికి మాత్రమే పరిమితం కాదు. గుత్తాధిపత్య మూలధన ప్రయోజనాల దృష్ట్యా భారతదేశ వ్యవసాయరంగాన్ని పునర్నిర్మించడంలో ఇది భాగంగా ఉంది. ఈ ప్రక్రియలో భాగంగా, నయా ఉదారవాదులు మొదట ఒక వ్యక్తిని భూమి స్వంతదారుగా నిర్ధారిస్తారు.ఆ వ్యక్తికి ప్రత్యేకమైన

హక్కు ఉందా లేదా అని చూడరు. అప్పటి నుంచి ఆ భూమి యాజమాన్యం ఇతరులకు బదిలీ చేయబడుతుంది. ఈ ప్రయోజనం కోసం, వారు భూమి హక్కుల సమస్యను పూర్తిగా నిర్వాహక సమస్యగా తగ్గించేసి భూమికి సంబంధించిన పరిపాలన వ్యవస్థ సామర్థ్యాన్ని మెరుగుపరిచే విధంగా చూస్తారు. ఇది వాస్తవానికి విరుద్ధమైనది. ఈ కార్యక్రమం లక్ష్యాన్ని పేర్కొనడంలో వారు ఎల్లప్పుడూ చాలా స్పష్టంగానే ఉన్నారు: భూమి బదిలీని సులభతరం చేయడమే లక్ష్యమని చెబుతూనేఉన్నారు. (ఆ లక్ష్యాన్ని చేరుకోవడంలో భాగంగానే వారు చిన్న రైతుల భూమిని పెద్ద భూస్వాములకు లీజుకు ఇవ్వడాన్ని ప్రోత్సహించే లక్ష్యంతో భూమి లీజుకు ఇవ్వడానికి సంబంధించిన కొత్త చట్టాన్ని తీసుకువస్తున్నారు.)

ప్రముఖ అంతర్జాతీయ కన్సల్టింగ్ సంస్థ మెకిన్సే 2001 లో తయారు చేసిన ఒక నివేదిక (ఏ రెఫెరెన్సు ను ఉదహరించకుండా) "భారతదేశ భూములలో చాలావరకు ఒక అంచనా ప్రకారం చెప్పాలంటే 90 శాతం వరకు కూడా "అస్పష్టంగా" ఉన్నాయని పేర్కొంది. [7] భారతదేశంలో భూమి కౌలు (లీజు) హక్కులు బలంగా ఉండటమే ఈ అస్పష్టమైన స్థితికి ఒక కారణమని కూడా ఆ నివేదిక చెప్పింది : "చట్టబద్దమైన, చట్టవిరుద్ధమైన రెండు తరహాల యజమానులు తమ ఆక్రమణలో ఉన్న ఆస్తిపై వాస్తవ హక్కులను పొందుతున్నారు. నిజమైన యజమాని తన ఆస్తిని అమ్ముకోవాలంటే చాలా సమయాన్ని వెచ్చించాల్సివస్తోంది, బోలెడంత కాగితపు పనిని చేయాల్సివస్తోంది. " [8] మెకిన్సే దృష్టిలో, కౌలుదారులంతా ఆక్రమణదారులే, వారికి చట్టబద్దమైన సాక్ష్యాలేమీ లేవు. అవి "నిజమైన యజమానులు" వద్ద మాత్రమే ఉన్నాయి.

వాస్తవానికి, భారతదేశపు చట్టాల పుస్తకాలలో ఉన్న అటువంటి కౌలుదారుల హక్కులు దశాబ్దాలుగా భారత రైతాంగం చేసిన తీవ్రమైన పోరాటాల వారసత్వం. ఈ పోరాటాలు ఎదో ఒక మేరకు వాస్తవానికి భూమిపై పనిచేసేవారికి దాని ఫలాలపై ప్రాధమిక హక్కు ఉందని, కాగితలమీద వ్రాసుకొన్న యాజమాన్య హక్కుల ఆధారంగా కౌలు తీసుకొంటున్న వారికి కాదనే సామాజిక హక్కులను నెలకొల్పాయి. మెకిన్సే పేర్కొన్న 'స్పష్టత' వాస్తవానికి ఒక సామాజిక ప్రశ్న, భూమిని స్వాధీనం చేసుకోవటానికి, దాని ఫలాలను అనుభవించడానికి వివిధ వర్గాల మధ్య సాగుతున్నపోరాటం.

భారతదేశంలో సాంప్రదాయ భూ సంస్కరణలు (మధ్యవర్తుల రద్దు, కౌలుదార్ల చట్టం, భూమి యాజమాన్యంపై పరిమితుల విధింపు ) ఇకముందు ఏమాత్రం ప్రయోజనకరంకాదని, వాస్తవానికి ఇప్పుడవి హానికరంగా మారాయని 2007 లో ప్రపంచ బ్యాంకు ఒక పత్రంలో పేర్కొంది. [9]

భూ సంస్కరణ చట్టాలు "భూ సంస్కరణల లబ్దిదారులు, భూ సంస్కరణల లక్ష్యంగా ఉన్న భూస్వాములు భూమిని ఎలా ఉపయోగిస్తున్నారన్న సామర్థ్యాన్ని" ప్రభావితం చేశాయి. మరో మాటలో చెప్పాలంటే, 'వృద్ధిని' పెంచడానికి, భూ సంస్కరణ చట్టాలను తొలగించడం అవసరం. వాటి స్థానంలో ప్రపంచ బ్యాంకు కొత్త

మార్గదర్శకాలను (చార్టర్‌ను) రూపొందించింది: “ భూమి అంతటిని గణనంలోకి తీసుకొని రావడానికి కంప్యూటరీకరణను, ఏకీకరణను, రికార్డుల వ్రాతప్రతుల వాడకాన్ని విస్తృతం చేయాలి. రాష్ట్రవ్యాప్తంగా ప్రదేశాలన్నింటిని నమోదు చేయడానికి ఒక ఆధారాన్ని కల్పించాలి. సర్వేలో ప్రైవేట్ రంగ భాగస్వామ్యాన్ని అనుమతించాలి. ప్రభుత్వం తన దృష్టిని నియంత్రణపై కేంద్రీకరించాలి. ” చివరగా, భూమి లీజుకు ఇవ్వడాన్ని చట్టబద్ధం చేస్తూ "భూముల మార్కెట్లపై ఆంక్షలను తొలగించాలి." అని చెప్పింది; లీజుకు పరిమితులను తొలగించాలి. వ్యవసాయేతరులకు భూమి బదిలీ చేయడంతో సహా భూమి బదిలీ పై ఉన్న అన్ని రకాల ఆంక్షలను తొలగించాలి. పెట్టుబడిదారులు వ్యవసాయ భూమిని నేరుగా (అంటే ప్రభుత్వ మధ్యవర్తిత్వం లేకుండా) పొందటానికి అనుమతించాలని పేర్కొంది.

కొలంబియా విశ్వవిద్యాలయ ఆర్థికవేత్త అరవింద్ పనగారియా మరో అడుగు ముందుకేసి, అత్యధికంగా అమ్ముడైన తన పుస్తకం ఇండియా: ది ఎమర్జింగ్ జెయింట్ (2008) లో, "భారతదేశంలో అత్యంత సమర్థవంతమైన భూముల మార్కెట్" కోసం ముందుగా "భూమి పట్టాదారులకు ప్రభుత్వం హామీ" ఇవ్వడం అవసరమని పిలుపు నిచ్చారు: ప్రస్తుతం ఇప్పుడున్న భూముల రికార్డులను కంప్యూటీకరణ చేసే ప్రయత్నం జరుగుతోంది. ఇప్పటికే ఉన్న రికార్డులను సరిగ్గా గ్రంధస్తం (డాక్యుమెంట్) చేసి భద్రపరచడం ఒక మంచి ఉపయోగకరమైన కార్యక్రమం కానీ "ప్రభుత్వ హామీతో ఇచ్చే భూమి పట్టాలు" లేనందున ఇది మౌలికమైన సమస్యను పరిష్కరించదు. భూమి పట్టాలకు ప్రభుత్వం హామీ ఇవ్వాలంటే ప్రభుత్వం శాసనసభ ద్వారా చర్య తీసుకోవడం అవసరం. రాజకీయంగా సంక్లిష్టంగా ఉన్నప్పటికీ, ఈ సంస్కరణకు చాలా పెద్ద ప్రతిఫలం ఉంటుంది. ఇది లక్షలాదిమంది రైతులకు మనశ్శాంతిని కలిగించడమే కాక, భవిష్యత్తులో కోర్టుల్లో వేసే లక్షలాది దావాలను నివారించవచ్చును. ఇది భారతదేశంలో అత్యంత సమర్థవంతమైన గ్రామీణ భూముల మార్కెట్‌కు దారితీస్తుంది. (పేజి 322)

వాస్తవానికి 2008 ఆగస్టు మాసంలో కాంగ్రెస్ నేతృత్వంలోని యుపిఎ ప్రభుత్వం , "జాతీయ భూమి రికార్డుల ఆధునికీకరణ కార్యక్రమం"ను (ఎన్‌ఎల్‌ఆర్‌ఎంపి) ప్రారంభించింది, భూమి స్వంతదార్లకు నిశ్చయాత్మకమైన ప్రభుత్వ హామీతో పట్టాలు ఇచ్చే వ్యవస్థను ఏర్పాటు చేయాలనే స్పష్టమైన లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించింది. [ 10] ఇందుకు రాష్ట్ర ప్రభుత్వాలు తమ అంగీకారాన్ని తెలియజేస్తూ, ఈ పథకాన్ని అమలు చేయడానికి తమ ప్రణాళికలను పంపినట్లుగా ఉంది. అయితే పాలకులు ఆశించిన దానికంటే పురోగతి నెమ్మదిగా ఉంది. రఘురామ్ రాజన్ ఆధ్వర్యంలో తయారుచేసిన 2012-13 సంవత్సరం ఆర్థిక సర్వే నివేదికలో ఈ కార్యక్రమాన్ని ( ఎన్‌ఎల్‌ఆర్‌ఎంపీని) వేగవంతం చేయాలని “భూమిని జాగ్రత్తగా మ్యాప్ చేయడానికి, నిశ్చయాత్మకమైన ప్రభుత్వ హామీ కలిగిన పట్టా మంజూరు చేయడానికి”, ఇంకా “భూమిని ఎక్కువ ద్రవ్య వినియోగంలోకి” తీసుకురావడానికి (అంటే ఎప్పుడంటే అప్పుడు అమ్ముకొని డబ్బు చేసుకోవడానికి వీలుగా) మార్పులు త్వరితగతిన తీసుకొని రావాలని పేర్కొన్నారు.

2014 లో కొత్తగా వచ్చిన మోడీ ప్రభుత్వం పనగారియాను తన కేంద్ర విధాన సంస్థ నీతి ఆయోగ్‌కు అధిపతిగా చేసింది. ఆయన అధికారంలోకి రాగానే తాను కలలుకన్న భూముల మార్కెట్‌ను సృష్టించడం గురించి సిద్ధమయ్యాడు. నీతి ఆయోగ్ 2015 లో వెలువరించిన ఒక పత్రంలో ఇలా పేర్కొంది:

..... భారతదేశంలో భూమి స్వంతదారుకి హక్కులును కూడా సరిగా నిర్వచించలేదు. స్వంతదారు హక్కులన్నీ ఊహాజనితమైనవి, కోర్టులలో సవాలు చేయడానికి వీలైనవి. ఈ లక్షణం వలన యజమాని తన భూమికి నిజమైన విలువను పొందలేకపోవడంతో శక్తివంతమైన భూముల అమ్మకాల మార్కెట్ ను అభివృద్ధి కానీయలేదు. దీనికి ప్రతిగా, జీవనాధార వనరుగా ఉపయోగించుకోవడానికి తన భూమి మరీ చిన్నదిగా ఉందని రైతు భావించడం వల్ల కూడా భూమి అమ్మకాలను నిరుత్సాహపరుస్తుంది. [11]

అందువల్ల కాంగ్రెస్ నేతృత్వంలోని యుపిఎ నుండి ప్రస్తుత మోడీ ప్రభుత్వం వరకు అంతర్జాతీయ సంస్థలు, ఆ తరువాత ప్రభుత్వాలు "శక్తివంతమైన భూమి అమ్మకాల మార్కెట్ల" ద్వారా "లాభంలేని" భూమి నుండి రైతును విడిపించాలనే ఉద్దేశ్యాన్ని చెప్పడానికి ఎప్పుడూ మొహమాటపడలేదు.

కోవిడ్ -19 సంక్షోభాన్ని ఎలా వాడుకోవాలి ...

2020 ఏప్రిల్ మాసంలో భారతదేశం ప్రపంచంలోకెల్లా అత్యంత కఠినమైన లాక్డౌన్ నిబంధనలను ఎదుర్కొంటున్న సమయంలో - దేశ విభజన తరువాత జాతి అత్యంత భయానకమైన మానవతా సంక్షోభానికి గురైన సమయంలో - వ్యాపార పత్రికలలో వ్యాఖ్యాతలు రాజకీయంగా కఠినమైన చర్యల ద్వారా ఈ సందర్భాన్ని ఉపయోగించుకోవాలని ప్రభుత్వానికి పిలుపునిచ్చారు: “ భూమి శక్తి సామర్ధ్యాలను వెలికితీయడం అవసరమన్న దాంట్లో ఎప్పుడూ సందేహం లేదు. అయితే ఆ పనిని ఇప్పుడు చేయడానికి కరోనావైరస్ సంక్షోభం మనకు ఒక అవకాశం ఇచ్చింది.” అని చెప్పారు. ఇంకా పనగారియా "సంక్షోభాన్ని వృధాగా పోనీయవద్దు" అంటూ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసారు. " సాధారణ 'శాంతి' సమయంలో భూమికి కార్మికులకు సంబంధించిన మార్కెట్లలో సంస్కరణలను ప్రవేశపెట్టడం ప్రభుత్వానికి చాలా కష్టతరమైనపని, ఆ రంగాల్లో సంస్కరణలు ప్రవేశపెట్టడానికి ప్రభుత్వానికి 'సంక్షోభం' మంచి అవకాశాన్ని ఇస్తోంది" అంటూ పనగారియా పేర్కొన్నారు.

ఏప్రిల్ 2020 లో, లాక్డౌన్ ఉవ్వెత్తున అమలవుతున్న తరుణంలో డ్రోన్ సర్వేల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని అన్ని నివాస గృహాలను మ్యాప్ చేయడానికి ప్రధానమంత్రి ‘స్వమిత్వా’ (మెరుగైన సాంకేతిక పరిజ్ఞానంతో గ్రామాల సర్వే, గ్రామ ప్రాంతాల మ్యాపింగ్) అనే కొత్త పథకాన్ని ప్రారంభించారు. ఇది పూర్తయిన తర్వాత, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ గృహాలకు సంబంధించి గ్రామీణ కుటుంబాలకు ఆస్తి కార్డులను జారీ చేస్తాయి. (ఇది ఇప్పటికే ఉన్న ఇంటి యాజమాన్యాన్ని లాంఛనప్రాయంగా మారుస్తుంది. ఇళ్లస్థలాలు లేని వారికి ఈ పథకం వల్ల ప్రయోజనం ఉండదు.)

వ్యక్తిగత గ్రామీణ ఆస్తులను విడగొట్టి చూపించడమే కాకుండా, ఇతర సామాజిక ఆస్తులు గ్రామ పంచాయతీలు, రోడ్లు, చెరువులు, కాలువలు, బహిరంగ ప్రదేశాలు, పాఠశాలలు, అంగన్‌వాడీలు, ఆరోగ్య ఉప కేంద్రాలు మొదలైనవాటిని కూడా సర్వే చేస్తారు. వీటన్నింటికి సంబంధించిన పటాలను సృష్టిస్తారు.

ప్రభుత్వం ఎందుకు ఈ పథకాన్ని ఇంత అత్యవసరంగా భావించింది? ఇది "మార్కెట్లో భూమిని పొట్లాలు లాగ (పార్శిళ్లను) మరింత తేలికగా అమ్ముకొని డబ్బుచేసుకొనే స్థితిని (లిక్విడిటీని) పెంచుతుందని" ప్రభుత్వం పేర్కొంది, (అంటే ఆస్తి అమ్మకాలను సులభతరం చేస్తుంది). అంతేకాకుండా గ్రామీణ ప్రాంతాల్లో డ్రోన్ ఆధారిత మ్యాపింగ్ కోసం గణనీయమైన భౌతిక మౌలిక సదుపాయాల కల్పన, శిక్షణ పొందిన సిబ్బందిని ఏర్పాటు చేసుకొంటే తరువాత ఇవే సదుపాయాలను ప్రభుత్వం వ్యవసాయ భూములను మ్యాపింగ్ చేయడానికి కూడా ఉపయోగించుకోవచ్చును.

## నీతి ఆయోగ్ తయారు చేసిన "భూమి పట్టాల చట్టం" (ల్యాండ్ టైటిలింగ్ చట్టం)

2008 లో యుపిఎ ప్రభుత్వం భారతదేశంలో భూమిని "నిశ్చయాత్మకమైన భూమి పట్టాలు" ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో జాతీయ భూమి రికార్డుల ఆధునీకరణ కార్యక్రమాన్ని (ఎన్ఎల్ఆర్ఎంపి) చేపట్టింది. దీనిని 2014 లో మోడీ ప్రభుత్వం “డిజిటల్ ఇండియా భూమి రికార్డుల ఆధునీకరణ కార్యక్రమం” (DILRMP) గా పునరుద్ధరించింది.

దీనిని మరింత ముందుకు తీసుకెళ్లి, నవంబర్ 2020 లో, నీతి ఆయోగ్ ఒక ల్యాండ్ టైట్లింగ్ చట్టం నమూనాను విడుదల చేసింది. ఆ నమూనాచట్టాన్ని అవలంబించాలని రాష్ట్ర ప్రభుత్వాలను ఒత్తిడి చేస్తోంది. (భూమి రాష్ట్రాలకు సంబంధిచిన అంశం. కేంద్ర పరిధిలోకి రాదు.) అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్ఎల్ఆర్ఎంపీపై సంతకం చేసినందున, వారు ఇప్పుడు తమ రాష్ట్రాలలో ఇటువంటి చట్టాలను చేయడానికి అంగీకరించవచ్చు.

పైన పేర్కొన్న చర్య ప్రాముఖ్యతను అర్థం చేసుకోవడానికి కొంచెం వీటి నేపథ్యాన్ని తెలుసుకోవడం అవసరం.

గ్రామీణ కుటుంబాలకు చెందిన ఆస్తుల రూపంలోనే 73 శాతం భూమి ఉంది. (భవనాలు, ఆ భూమిలో ఉన్న ఇతర నిర్మాణాలు మరో 21 శాతం ఉన్నాయి.) [12] వాటి స్వంతదారులు ఎవరు, ఇప్పుడు అవి ఎవరి స్వాధీనంలో ఉన్నాయి, వాటిని పొందే హక్కు ఎవరికి ఉంది, ఎవరికి నిర్దిష్ట వినియోగ హక్కులు ఉన్నాయి, ఎవరు ఆ భూమిలో ఒక భాగాన్ని (పార్శిల్) బదిలీ చేయగలరు అనేవి భారతదేశంలో సాధారణమైన ప్రశ్నలు కావు. అవి కేవలం సాంకేతికపరమైన లేదా పరిపాలనా పరమైన అంశాలకు సంబంధించిన ప్రశ్నలు కాదు. ఇవి సామాజిక పరమైనవి. ఒక సామాజిక ప్రక్రియ ద్వారా మాత్రమే వాటిని పరిష్కరించాలి, నిర్ణయించాలి. భూమి హక్కులనేవి వివిధ వ్యక్తులకు సంబంధించి వేర్వేరుగా అనేక పొరలు పొరలుగా ఉంటాయి. ఇవి కొందరికి జీవన్మరణ సమస్యగా పరిణమించవచ్చును.

ప్రస్తుతం భారతదేశంలో భూమి పట్టాలకు సంబంధించి ఒక 'ఊహాజనిత' వ్యవస్థ ఉంది, ఇక్కడ ప్రభుత్వం భూమి పట్టాలకు హామీ ఇవ్వదు. అమ్మకపు దస్తావేజులు, ఆదాయం పన్ను రసీదులు మొదలైనవే భూమి యాజమాన్యానికి సాక్ష్యాలు. యాజమాన్యాన్ని ధృవీకరించు కొనే బాధ్యత ఆస్తి కొనుగోలుదారుడిపై ఉంటుంది. అందువలనే భూమి కొనుగోలు చేయాలనుకొన్న వ్యక్తి తరచుగా ఉన్న పత్రాలన్నింటిలో పట్టా కాగితాలకోసం వెతుకులాడతాడు.

'నిశ్చయాత్మక' పట్టా (టైటిలింగ్ ) వ్యవస్థలో, ఆస్తికి పట్టాదారుల పేర్లు రాష్ట్ర ప్రభుత్వం నమోదు చేసి ఆపట్టాదార్లకు హామీ ఇస్తుంది. అటువంటి వ్యవస్థను నెలకొల్పాలంటే - రుణదాతల వాదనలతో సహా కౌలుదార్ల వంటి ఇతర వ్యక్తుల హక్కులతో కలుపుకొని మొత్తంగా భూమి యాజమాన్యాన్ని నిశ్చయించడం అవసరం. అటువంటి నిశ్చయ నిర్ణయం తీసుకున్న తర్వాత, మిగతా వ్యక్తులందరికీ వ్యతిరేకంగా భూమి స్వంతదారు హక్కులకు రాష్ట్రం హామీ ఇస్తుంది. ఇటువంటి వ్యవస్థను అంతర్జాతీయంగా "టోరెన్స్ సిస్టమ్" అని పిలుస్తారు. అభివృద్ధి చెందిన దేశాలలో అన్నింటిలో ఈ వ్యవస్థ లేదు. నిజానికి ఇది అమెరికాలోని చాలా రాష్ట్రాల్లో కూడా లేదు.

న్యాయ విద్వాంసుడు జోనాథన్ జస్లోఫ్ 'భూమి రిజిస్ట్రేషన్ పత్రాలను అధికారులు అంగీకరించాలి లేదా తిరస్కరించాలి కాబట్టి, టొరెన్స్ వ్యవస్థ కోసం ప్రస్తుతం చేస్తున్న కార్యక్రమంలో అధికార యంత్రాంగ అవినీతికి అపారమైన అవకాశాన్ని కల్పిస్తోంది' అని పేర్కొన్నాడు [13]. అధికారిక రికార్డు శక్తివంతమైన స్వార్థ ప్రయోజనాల దృష్ట్యా నిశ్చయమవుతుంది.

## భారతదేశ చరిత్రే దీనికి తగిన సాక్ష్యం

(1) భూమిపై భూస్వామి గుత్తాధిపత్యాన్ని విచ్ఛిన్నం చేయడంలో భూమిని తిరిగి పంపిణి చేసే ఉద్దేశ్యంతో చేపట్టిన భూసంస్కరణలు భారతదేశంలో పూర్తిగా విఫలమయ్యాయి. వ్యవసాయ సంబంధాలపై వేసిన అధికారిక టాస్క్ ఫోర్స్ (1973) సమర్పించిన చారిత్రాత్మక నివేదికలో అటువంటి సంస్కరణలకు ఎప్పుడూ అవకాశం లేదని స్పష్టంగా అంగీకరించింది: "దేశంలోనెలకొన్న అధికార వ్యవస్థ నిర్మాణ స్వభావాన్ని పరిశీలిస్తే, అవసరమైన రాజకీయ సంకల్పం లేకపోవడం సహజమే" [14] . ఇటీవల కూడా వ్యవసాయ సంబంధాల అధికారిక టాస్క్ ఫోర్స్ కమిటీ పూర్తికాని భూసంస్కరణల కార్యక్రమం గురించి (2009) "బడా భూస్వాములకు, రాజకీయ, ప్రభుత్వ అధికార వ్యవస్థకు మధ్య చాలా లోతైన కలయికలున్నాయని " పేర్కొంది.

(2) దాదాపు 20 కోట్ల జనాభా (షెడ్యూల్డ్ ట్రైబ్స్ , అటవీ ప్రాంతాల్లో నివసించే ఇతరులు) అటవీ హక్కుల చట్టం- 2006 కిందికి వస్తారని ఒక అంచనా. నేటికి 41 లక్షల మందికి మాత్రమే భూమి పట్టాలు పంచారు.

వీరు కేవలం పథకంలో నిర్దేశించిన జనాభాలో పది శాతానికి , రెండు కోట్లమంది జనాభాకు మాత్రమే ప్రాతినిధ్యం వహిస్తారు. కమ్యూనిటీ ఫారెస్ట్ రైట్స్ (సిఎఫ్ఆర్) అంటే ఉమ్మడి అటవీ యాజమాన్యం హక్కుల విషయంలో పరిస్థితి మరింత ఘోరంగా ఉంది: సిఎఫ్ఆర్ కిందికి వచ్చే ప్రాంతంలో కేవలం మూడు శాతం ప్రాంతాన్ని మాత్రమే ఇప్పటి వరకు ఆ చట్టం కిందికి తెచ్చారు.

దేశంలోని చాలా ప్రాంతాలలో కౌలుదారుల వివరాలను నమోదు చేయడం, భద్రపరచడం, ఉత్పత్తులలో వారి వాటాను మెరుగుపరచడం వంటి చాలా సాధారణమైన లక్ష్యాన్ని నెరవేర్చడానికి కూడాఎప్పుడూ ప్రయత్నించలేదు. పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో మాత్రమే 1978-82 మధ్యకాలంలో ఇందుకు సంబంధించి ఒక ప్రధాన కార్యక్రమాన్ని ('ఆపరేషన్ బార్గా') చేపట్టారు. ఇందులో భాగంగా ఈ సమయంలో 8,000 ప్రదేశాలలో అధికారులు కాంపు చేశారు. అధికార వామపక్ష ఫ్రంటు కు చెందిన రైతు సంఘాలు రిజిస్ట్రేషన్ నమోదు కోసం కౌలుదార్లను, పంట వాటాదారులను సమీకరించాయి. అయినప్పటికీ ఇది సగం కౌలుదార్లు, సగం కౌలు భూమిని మాత్రమే నమోదు చేయగలిగారు. మిగిలిన సగం మంది సగం భూమి నమోదుకాలేదు. 1980 దశకం మధ్య కాలానికి ఈ కార్యక్రమం దరిదాపుగా ఆగిపోయింది. [15]

## భూసంస్కరణల చివరి ఖననం

ఇంకా జస్లోఫ్ చెప్పినట్లుగా, "భూమి స్వంతదార్లను" రక్షించాలంటే, "భూమిపై యాజమాన్యం ఎవరికి ఉండాలనే ప్రశ్నను నివారించలేము": ఇతర విషయాలతోపాటు, టొరెన్స్ వ్యవస్థ భూమి తమ స్వాధీనంలో లేని యజమానులను భూములు కోల్పోకుండా ఆ భూమిని ఆక్రమించుకున్న గుడిసెవాసుల నుండి కాపాడుతుంది: గుడిసెవాసులకు పట్టాదారు నమోదు (టైటిల్ రిజిస్ట్రేషన్) సర్టిఫికెట్లు ఉండవు. అందువల్ల పట్టా ఉండదు. అయినప్పటికీ భారతదేశంలో న్యాయమైన భూ పంపిణీ వ్యవస్థ గుడిసెవాసులకు అనుకూలంగా ఉంది. వీరిలో లక్షలాది మంది క్రూరమైన అణచివేత చరిత్రకు వారసులుగా మిగిలిన నిరుపేద బాధితులు. వారే ఏ సందర్భంలోనైనా భూమిని ఉత్పాదకంగా, ఎన్నో యేళ్ళుగా ఉపయోగించుకుంటున్నారు.

అందువల్ల టొరెన్స్ వ్యవస్థ భూసంస్కరణల చిట్టచివరి, అధికారిక ఖననాన్ని సూచిస్తుంది. ఒకసారి రాష్ట్రం యజమాని భూమి పట్టాకు హామీ ఇస్తుంది, అదే రాష్ట్రం భూమిలేనివారికి భూమిని పునఃపంపిణీ చేయడానికి ఏమి సమస్య ఉంది? పునఃపంపిణీ చేయడానికి చాలా భూమి ఉన్నప్పటికీ చేయడంలేదు. (2009 రాష్ట్ర వ్యవసాయ సంబంధాల కమిటీ చెప్పిన మాటల్లోనే) " భూమి పునఃపంపిణీ చర్యలు, కొల్దారు కాలానికి యాజమాన్యానికి భద్రత కల్పించడం, నిరుపేద బలహీన వర్గాలనుండి అత్యధిక వడ్డీల వసూళ్లను అరికట్టడం,

ఇళ్లస్థలాలను స్వంతం చేయడంతో సహా భూసంస్కరణలు చేపట్టకపోతే గ్రామీణ పేదరిక వ్యవస్థకు నిర్మాణాత్మక ముగింపును ఈ దేశం ఎప్పటికీ సాధించలేదు.

ప్రస్తుత కాలంలో 'సంస్కరణ' అనే పదాన్ని చారిత్రక కోణంలో ప్రగతిశీలక మార్పు అనే అర్థంతో ఉపయోగించడం లేదు. అన్ని రకాల పూర్తిగా తిరోగమన ఉదారవాద విధానాలను, పూర్తిగా దోపిడీ విధానాలను కూడా సంస్కరణలుగా పేర్కొంటున్నారు. అదేవిధంగా 'భూ సంస్కరణ' అనే పదబంధాన్ని కూడా వ్యతిరేకార్థంలోనే వాడుతున్నారు: ఇది ఇప్పుడు అన్ని రకాల ఫ్యూడల్ భూస్వామ్య పీడనలను రద్దు చేయడం, భూమిపై గుత్తాధిపత్యాన్ని బ్రద్దలుకొట్టే చారిత్మాతక ప్రగతిశీలక లక్ష్యాన్ని ఉద్దేశించి వాడుతున్న పదం కాదు. అందుకు భిన్నంగా పేద రైతుల నుండి ఉత్పత్తి వనరులను లాక్కోవడానికి ఉద్దేశించిన దోపిడీ విధానాలను సంస్కరణలు అంటున్నారు.

నిజమే, జన్లోఫ్ పేర్కొన్నట్లుగా, పట్టాదార్ల నమోదు (టైటిలింగ్) కోసం చేస్తున్న ఉధృత కార్యక్రమం వాళ్ళకేమీ లేకుండా చేయడానికి చేసే ఉధృత కార్యక్రమం కాగలదు:

అధికార లాంఛనప్రాయీకరణ (ఫార్మలైజేషన్) అనేక కారణాల వల్ల పేదలకు సమస్యను తెచ్చిపెడుతుంది. భూమి తమదేనన్న పేదల వాదనలను సమర్థించుకోవలసిందిగా వారిని బలవంతం చేస్తుంది. అలా రుజువు చేసుకోవడానికి వారికి సరిపడినన్ని వనరులు లేకపోవచ్చు. సంఘంలో ఆచారం ప్రకారం వచ్చే పద్ధతులు లేదా సాముహికంగా కౌలు చేసుకొనే విధానాలు వాస్తవంలో అమలవుతాయి కానీ వాటిని లాంఛన ప్రాయమైన అధికార పద్ధతులుగా మార్చడం కష్టం. ఈ అధికార లాంఛనప్రాయీకరణ వలన ఆస్తుల విలువ పెరుగుతుంది. ఫలితంగా ప్రభుత్వం ఆస్తిపన్ను విధించవచ్చును. కానీ పేదలు ఆ పన్నులు చెల్లించలేకపోతే వారిని వారి ఇళ్ల నుండి తరిమివేస్తారు. మరింత నిక్కచ్చిగా చెప్పాలంటే, పెరిగిన భూమి విలువలు తరిమివేసే ఆలోచనలనే ప్రోత్సహిస్తాయి తప్ప, పేద వారికి వారు తిరస్కరించలేనంత ఆఫర్లను ఇవ్వడానికి సుహృద్భావ వైఖరితో తగిన ప్రక్రియను చేపట్టే ఆసక్తులు ఉండవు.

కానీ ఈ ప్రక్రియ లో ఇమిడివున్న చిక్కులు నిశ్చయాత్మకమైన టైటిలింగ్ సమయంలో రైతాంగంలోని ఒక వర్గం నుంచి భూమిని తొలగించడానికి మాత్రమే పరిమితంకాదు. నిశ్చయాత్మక పట్టాదార్ల ఫిక్సింగ్ అనేది చాలా విస్తృతమైన తొలగింపు కార్యక్రమానికి వేదికగా ఉద్దేశింపబడినది.

ఈ వ్యాసం రెండవ భాగంలో (అనుసరించడానికి), భూమిపై నియంత్రణ పొందాలనే అంతర్జాతీయ పెట్టుబడిదారుల కోరికకు ఆజ్యం పోస్తూ ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో వచ్చిన మార్పులను చర్చిస్తాము.

భారతదేశం వ్యవసాయరంగంలో ప్రణాళికాబద్ధమైన పునర్వ్యవస్థీకరణ రైతాంగాన్ని వారి భూమినుంచి విడిపోవడానికి ఎలా బలవంతం చేస్తుందనే అంశాలను చర్చిస్తాము.

## ముగింపు మాట :

## మూడవ ప్రపంచ ఆస్తి 'నిశ్చయాత్మక పట్టా' సిద్ధాంతకర్త

పెరువియన్ ఆర్థికవేత్త హెర్నాండో డి సోటో అంతర్జాతీయంగా బాగా అమ్ముడుపోయిన తన పుస్తకం " ది మిస్టరీ ఆఫ్ కాపిటల్ " లో ప్రతిపాదించిన సొగసైన సిద్ధాంతం నుండి నిశ్చయాత్మక పట్టా (కంక్లూసివ్ టైటిలింగ్)ను తీసుకొన్నట్టు చెప్పుకొన్నారు. 2000 సంవత్సరంలో ప్రచురించబడినప్పటి నుండి, ఈ పుస్తకం ఉదారవాదులకు బైబిల్‌గా మారింది. ఉదార వాదానికి ప్రసిద్ధి చెందిన మార్గరెట్ థాచర్, బిల్ క్లింటన్, జార్జ్ డబ్ల్యూ. బుష్, ఇద్దరు నోబెల్ మెమోరియల్ బహుమతి గ్రహీతలైన ఆర్థికవేత్తలు, ఇంకా ఇతర ప్రముఖులు, అధికారుల నుండి ప్రశంసలు అందుకుంది. డి సోటో నెలకొల్పి నడుపుతున్న సంస్థ "ప్రపంచంలోనే అత్యంత పలుకుబడి కలిగిన సంస్థల్లో రెండవదిగా ప్రభావవంతమైన ఆలోచనల మడుగు గా (థింక్ ట్యాంక్ గా) నిలిచింది. ఇది అంతర్జాతీయ కార్మిక సంస్థ, ఐరాస, కొన్ని మాజీ సోవియట్ దేశాలు, మూడవ ప్రపంచంలోని కొన్ని దేశాలు - మొత్తం ముప్పై ప్రభుత్వాలనుండి (పనుల నిధుల) కేటాయింపులు పొందుతున్నది." [16]

ప్రత్యేకంగా శ్రామిక ప్రజలు పెట్టుబడిదారుల మధ్య సరిదిద్దలేని వర్గ ప్రయోజనాలకు సంబంధించిన మార్క్స్ సిద్ధాంతాన్ని తిరస్కరించడమే డి సోటో పుస్తక లక్ష్యంగా ఉంది. మార్క్సిజం మాత్రమే ఇప్పటికీ ఈ విషయాలు ఇలా ఉండటానికి గల కారణాలకు వివరణ ఇస్తుందని, కాబట్టి మార్క్సిస్ట్ ఉద్యమాలు తిరిగి జీవం పోసుకుంటాయని ఆయన భయపడుతున్నాడు: "ఈ రోజు, పెట్టుబడిదారీ వ్యతిరేకులకు - వారి వాదనలకు అవసరమైన మందుగుండు సామగ్రిని అందించే స్పష్టమైన గణాంకాలు ఉన్నాయి, పెట్టుబడిదారీ విధానం కేవలం పేద దేశాల నుండి ధనిక దేశాలకు ఆస్తి బదిలీ అని వాదించడానికి, అభివృద్ధి చెందుతున్న దేశాలలో పాశ్చాత్య ప్రైవేట్ పెట్టుబడులు ఆ దేశాల్లో ఉన్న వనరులను పెద్దఎత్తున బహుళజాతి సంస్థలు భారీగా స్వాధీనం చేసుకోవటానికి తప్ప మరేమీ కాదని వాదించేందుకు అవసరమైన గణాంకాలన్నీ ఉన్నాయి. "[17]

మూడవ ప్రపంచంలోని దుఃఖానికి ప్రపంచ పెట్టుబడిదారీ విధానమే కారణమని పేర్కొంటూ నేరారోపణ చేసేవారిని ఖండించడానికే డి సోటో బయలుదేరాడు. పశ్చిమ దేశాలలో (అభివృద్ధి చెందిన దేశాలు), ఆస్తులకు సంబంధించి బలమైన అధికారిక వ్యవస్థలు ఉండటం వలన వ్యక్తులందరూ ఆర్థిక వ్యవస్థలో పాల్గొనడానికి వీలు కల్పిస్తోందని, అందువల్ల పెట్టుబడిదారీ విధానం అక్కడ విజయవంతమవుతుందని ఆయన పేర్కొన్నారు. మూడవ ప్రపంచంలో ఇది అలా ఉండదు. ప్రశ్నార్థకమైన పద్ధతిని ఉపయోగించి, ప్రపంచ

పేదలకు ఇప్పటికే తగినంత ఆస్తి ఉందని ఆయన కనిపెట్టారు: "మా లెక్కల ప్రకారం, మూడవ ప్రపంచ దేశాలలోను, మాజీ కమ్యూనిస్ట్ దేశాలలో పేదల వద్ద చట్టబద్ధంగా స్వంతం కాని భూములు మొత్తంగా కనీసం 9.3 ట్రిలియన్ డాలర్లు విలువ కలిగినవి ఉన్నాయి." (ఈ వాక్యాలు పుస్తకంలో ఇటాలిక్స్ లో ఉన్నాయి)[18] ఇందులో 6.7 ట్రిలియన్ డాలర్ల విలువచేసే ఆస్తులు పట్టణ పరిధిలో నివాస గృహాలుగా ఉన్నాయి (మురికివాడలు, రేకుల షెడ్డులు గుడిసెలు ఉన్న ప్రాంతాలు). 2.6 ట్రిలియన్ల విలువచేసే గ్రామీణ ప్రాంతాలు (భూములు) వీరి చేతుల్లో ఉన్నాయి. కానీ దీనిని ఆయన "డెడ్ క్యాపిటల్" అంటే ఎందుకు పనికిరాకుండా పడి ఉన్న పెట్టుబడిగా పేర్కొంటారు. ఎందుకంటే "పేదలకు ఇక్కడ లేనిదేమంటే - వారి పనిని, పొదుపులను మూలధనంగా మార్చగల చట్టబద్ధమైన సమగ్రమైన ఆస్తి వ్యవస్థలు లేవు ." [19] వారి ఆస్తికి చట్టపరమైన పట్టాలు ఉంటే, వారు దానిని కుదువపెట్టి రుణం తీసుకోవచ్చు, ఆ పెట్టుబడితో వారి వ్యాపార కార్యకలాపాలను ప్రారంభించవచ్చు లేదా విస్తరించవచ్చు.

డి సోటో యొక్క బోగస్ సిద్ధాంతం గురించి మనం ఇక్కడ చర్చించాల్సిన అవసరం లేదు, కానీ మన ప్రస్తుత చర్చకు సంబంధించిన ఒక విషయం ఉంది. సోటో చిత్రణకు విరుద్ధంగా, భారతదేశంలో గ్రామీణ భూమి పూర్తిగా నమోదు కాకుండా లేదు. అంతేకాకుండా భారతదేశంలో గ్రామీణ రుణాలను ప్రభుత్వ రంగ బ్యాంకులు విస్తరించాయి, ప్రైవేటు బ్యాంకులు కాదు, ఎంత రుణాన్ని ఇవ్వాలి , ఏ రకమైన అనుసంధానాన్ని హామీగా అంగీకరించాలి అనే నిర్ణయాలు ప్రభుత్వ విధానం నిర్ణయిస్తుంది. గ్రామాల్లో భూములున్నవారు తమ వద్ద ఉన్న స్థలాలపై తమ హక్కును రుజువు చేసే వివిధ రకాల పత్రాలను కలిగి ఉన్నారు. వాటి ఆధారంగా వారిలో లక్షలాది మంది ఇప్పటికే బ్యాంకు రుణాలు పొందారు. అధికారిక పత్రికా ప్రకటనల ప్రకారం, తొమ్మిది కోట్ల ఏడు లక్షల ( 97 మిలియన్ల) రైతు కుటుంబాలను ప్రధానమంత్రి -కిసాన్ ( PM-KISAN ) వెబ్ పోర్టల్‌లో నమోదు చేసారు. వీరిలో దాదాపు 67 మిలియన్ల మందికి కిసాన్ క్రెడిట్ కార్డులు ఉన్నాయి.

డి సోటో యొక్క బోగస్ సిద్ధాంతం గురించి మనం ఇక్కడ చర్చించాల్సిన అవసరం లేదు, కానీ మన ప్రస్తుత చర్చకు సంబంధించిన ఒక విషయం ఉంది. సోటో చిత్రణకు విరుద్ధంగా, భారతదేశంలో గ్రామీణ భూమి పూర్తిగా నమోదు కాకుండా లేదు. అంతేకాకుండా భారతదేశంలో గ్రామీణ రుణాలను ప్రభుత్వ రంగ బ్యాంకులు విస్తరించాయి, ప్రైవేటు బ్యాంకులు కాదు. ఎంత రుణాన్ని ఇవ్వాలి , ఏ రకమైన అనుసంధానాన్ని హామీగా అంగీకరించాలి అనే నిర్ణయాలు ప్రభుత్వ విధానం నిర్ణయిస్తుంది. గ్రామాల్లో భూములు కలిగిన వారు తమ వద్ద ఉన్న స్థలాలపై తమ హక్కును రుజువు చేసే వివిధ రకాల పత్రాలను కలిగి ఉన్నారు. వాటి ఆధారంగా వారిలో లక్షలాది మంది ఇప్పటికే బ్యాంకు రుణాలు పొందారు. అధికారిక పత్రికా ప్రకటనల ప్రకారం, తొమ్మిది కోట్ల ఏడు లక్షల ( 97 మిలియన్ల) రైతు కుటుంబాలను ప్రధానమంత్రి -కిసాన్ ( PM-KISAN ) వెబ్ పోర్టల్‌లో నమోదు చేసారు. వీరిలో దాదాపు 67 మిలియన్ల మందికి కిసాన్ క్రెడిట్ కార్డులు ఉన్నాయి.( కౌలుదార్లకు వారి వద్ద

ఉన్న భూమి మీద రుణాలు లభించడం లేదనడంలో సందేహం లేదు. అయితే భూమి పట్టాలకు చట్ట బద్ధత కల్పించే ఏకార్యక్రమం క్రిందనైనా పట్టా కాగితాలమీద వారి పేరును చేర్చరు.) భూమి కలిగిన పేదల సమస్య ఇప్పుడు నిశ్చయాత్మక మైన పట్టా కాగితం లేకపోవడం వలన రుణం పొందలేకపోవడం కాదు. వారు వివిధ రకాల దోపిడీలను, నష్టాలను ఎదుర్కొంటున్నారు, ఫలితంగా వారు తరచూ తమ రుణాలను సరిగా తిరిగి చెల్లించలేకపోతున్నారు. అందువల్ల కొందరు భూమిని కూడా కోల్పోతుంటారు. వారు ఏ నిబంధనలకు లోబడి శ్రమిస్తున్నారో ఆ నిబంధనలను మెరుగుపరచకుండా, డీ సొటో ప్రేరేపిత కార్యక్రమాలతో వారి పట్టా కాగితంలో నాణ్యతను పెంచడానికి, మరింత రుణం తీసుకోవడానికి వీలు కల్పించడం వల్ల ఉపయోగమేమిటి?

డి సోటో సిద్ధాంతం నుంచి నిజమైన దిగుమతి (అతను నేరుగా చెప్పకుండా తప్పించుకున్నప్పటికీ), పేదవాని ఆస్తి అతని "చట్టబద్ధమైన సమగ్ర ఆస్తి వ్యవస్థ" లో భాగం కానంతవరకు (అధికారిక, వ్యాపారానికి అనువైన, చట్టపరమైన పట్టా కానంత వరకు), ప్రైవేట్ కార్పొరేట్ రంగం ఆ భూమిని సులభంగా స్వాధీనం చేసుకోలేదు. ఋణం ఇచ్చిన బ్యాంకు అధికారులు లేదా ప్రైవేటు రుణదాతలు అప్పులు బారిన పడిన రైతుల భూమిని స్వాధీనం చేసుకునేటప్పుడు, వారు ఒక రైతు సమాజం ఆగ్రహాన్ని ఎదుర్కోవలసి రావచ్చు. భూమిని కొనుగోలు చేసి విక్రయించాలనే ఆలోచన పట్ల వారు చాలా కోపంగా ఉన్నారు.

డి సోటో మాటలలో: ఒక మంచి 'ఆస్తి వ్యవస్థ'లో ... ఆస్తులు నమూనా చూపకుండా ఒప్పందం కుదుర్చుకున్న వస్తువులు లాగ , అటువంటిదే మరొక వస్తువు ద్వారా మార్చుకోవడానికి వీలుండే వస్తువు లాగా - ఉపయోగపడతాయి. పరస్పరం మార్చుకోగలిగినవిగా ఉంటాయి. [అంటే, కరెన్సీ నోట్ల మాదిరిగా పరస్పరం మార్చుకోగలిగేవి] ఆస్తులు మన మనస్సుకు ప్రాతినిధ్యం వహించేలా చేస్తే ఇటువంటి పరస్పర మార్పిడికి వీలు కలుగుతుంది. అధిక విలువ కలిగిన మిశ్రమాలను ఉత్పత్తి చేయడానికి వాటిని సులభంగా కలపవచ్చు, విభజించవచ్చు, సమీకరించవచ్చును. ఆస్తులను (భూములను) వివిధ రూపాల్లో ఉండే ఇతర ఆస్తులకు కలిపి సమ్మిళతం చేసే విధంగా ప్రాతినిధ్యం వహించే విధంగా చేయగలిగితే అవి మరింత ఉపయోగకరంగా, ఆర్థిక వృద్ధికి ప్రధానమైన స్ప్రింగులా ఉంటాయి. ఈ విధంగా ఆస్తుల సామర్థ్యాన్ని పెంచవచ్చును. ఎందుకంటే తక్కువ-విలువగలిగిన పెట్టుబడులు పెట్టి అధిక-విలువతో కూడిన ఉత్పాదనలను పొందడమే వృద్ధి. [20 ]

ఒక వ్యాఖ్యాత చెప్పినట్లుగా, "డి సోటో వాదన ఏమంటే ఈ ఆస్తులను అధికారిక రంగంలోకి తీసుకొచ్చినట్లయితే గణనీయంగా ఎక్కువ సంపదను ఉత్పత్తి చేస్తాయి" [21]. కానీ సంపద ఎవరి కోసం? అందువల్ల డి సోటో సిద్ధాంతం పేదవారికి అనుకూలమైన శబ్దాలు చేస్తూ, వాస్తవానికి పేదలను వారి కొద్దిపాటి ఆస్తుల నుండి వేరు చేయడానికి అవసరమైన భూమికను సిద్ధం చేస్తుంది.

=====================================0000========================================

[1] కర్ణాటక భూ సంస్కరణల (సవరణ) బిల్లు- 2020లో - భూసంస్కరణల చట్టంనుంచి రెండు సెక్షన్లను - సంవత్సరానికి రూ .25 లక్షల కన్నా తక్కువ సంపాదించే వారికి మాత్రమే వ్యవసాయ భూమిని కొనుగోలు చేయడానికి అనుమతించే సెక్షన్ 79 ఎను, వ్యవసాయం జీవనోపాధిగా ఉన్న ప్రజలు మాత్రమే వ్యవసాయ భూమిని కొనుగోలు చేయడానికి అనుమతించే సెక్షన్ 79 బి ను తొలగించారు.

[2] జాన్ విల్కిన్సన్, "ది గ్లోబలైజేషన్ ఆఫ్ అగ్రిబిజినెస్ అండ్ డెవలపింగ్ వరల్డ్ ఫుడ్ సిస్టమ్స్", మంత్లీ రివ్యూ, సెప్టెంబర్ 2009.

[3] లాటిన్ అమెరికా, కరేబియన్ దేశాల్లోని భూముల మార్కెట్ : కేంద్రీకరణ, విదేశీకరణ, ఐరాస ఆహార వ్యవసాయ సంస్థ (FAO), 2014 నివేదిక చూడండి.

[4] "ఇండియా'స్ పీసెంట్రీ అండర్ నియోలిబరల్ రూల్" , మే 2017, చాప్టర్ III, https://rupe-india.org/66/partthree.html చూడండి. (ఉదారవాదుల పాలనలో భారత రైతాంగం )

[5] చట్టం పూర్తి రూపం: "భూసేకరణలో న్యాయమైన పరిహారం పారదర్శకత హక్కు- , పునర్వ్యవస్థీకరణ, పునరావాసం చట్టం - 2013"

6] జగదీష్ శెట్టిగర్, పూజ మిశ్రా, "భూసంస్కరణలు: పెద్దఎత్తున ఆటను మార్చే అంశం", హిందూ బిజినెస్ లైన్, నవంబర్ 23, 2020.

[7] మెకిన్సే, ఇండియా: ది గ్రోత్ ఇంపెరేటివ్, అక్టోబర్ 1, 2001, పే. 19. https://www.mckinsey.com/featured-insights/india/growth-imperative-for-india#. మార్కెట్‌ను "వేగంగా వృద్ధి చెందకుండా చేస్తున్న మూడు ప్రధాన అవరోధాలలో భూమి ఒకటని' మెకిన్సే పేర్కొన్నాడు: ఉత్పత్తి మార్కెట్లను నియంత్రించే నిబంధనలను హెచ్చించుకుంటూ వెళ్లడం (అనగా, ఒక రంగంలో ధర లేదా ఉత్పత్తిని ప్రభావితం చేసే నిబంధనలు); భూమి మార్కెట్లలో వక్రీకరణలు; వ్యాపారాల్లో విస్తృతమైన ప్రభుత్వ యాజమాన్యం " వీటిని తొలగిస్తే వార్షిక జిడిపి వృద్ధి నాలుగు శాతం పాయింట్లు పెరుగుతుందని మెకిన్సే చెప్పాడు.

[8] ఐబిడ్., పే. 27.

[9] భారతదేశం: వృద్ధి - పేదరికం తగ్గింపు కోసం విధానాలు (2007). ప్రపంచ బ్యాంకు ఇలా చెబుతోంది: "భూ సంస్కరణల చట్టం యొక్క సానుకూల ప్రభావం కాలక్రమేణా క్షీణిస్తోందని, వాస్తవానికి ప్రతికూలంగా మారే ప్రమాదం ఉందని ఎకోనొమెట్రిక్ ఆధారాలు సూచిస్తున్నాయి". p. xxi.

[10] "భారతదేశంలో భూమికి స్పష్టమైన పట్టాలు ఇచ్చే వైపుగా కదలిక : దానివలన కలిగే ప్రయోజనాలు, రహదారి పటం, మిగిలిన సవాళ్లు", రీటా సిన్హా, భూ వనరుల శాఖ కార్యదర్శి, గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం, ఆగస్టు 2008.

[11] నీతి ఆయోగ్, "వ్యవసాయ ఉత్పాదకతను పెంచడం, రైతులకు వ్యవసాయాన్ని గిట్టుబాటు చేయడం ", డిసెంబర్ 2015.

[12] నేషనల్ శాంపిల్ సర్వే ఆర్గనైజేషన్, ఎన్ఎస్ఎస్ 70 వ రౌండ్ (జనవరి-డిసెంబర్ 2013).

[13] జోనాథన్ జస్లోఫ్, “ఇండియాస్ ల్యాండ్ టైటిల్ క్రైసిస్: జవాబు లేని ప్రశ్నలు”, జిందాల్ గ్లోబల్ లా రివ్యూ, 2011, వాల్యూమ్. XX సంఖ్య X.

[14] "ల్యాండ్ రిఫార్మ్ ఈజ్ డెడ్, లాంగ్ లివ్ ల్యాండ్ రిఫార్మ్", ఎకనామిక్ అండ్ పొలిటికల్ వీక్లీ (ఇపిడబ్ల్యు) మే 19, 1973 లో ఉదహరించారు. ఇంకా: " సివిల్ క్రిమినల్ చట్టాలు, న్యాయ స్థానాల తీర్పులు, వీటికి ముందు జరిగే వ్యవహారాలు, పాలనా సంప్రదాయాలు, పాలన పద్ధతికి సంబంధించిన మొత్తం బరువు బాధ్యతలన్నింటినీ - ప్రవేటు ఆస్తులకు చెందిన ఒప్పందాలలో ఉమ్మడి బాధ్యతల ఉల్లంఘనల పై ఆధార పడి ఉనికిలో ఉన్న సామాజిక న్యాయంవైపుకి నెట్టివేసే సమాజంలో - గ్రామీణ ప్రాంతాల్లో ఆస్తుల సంబంధాలన్నింటిని పునర్వ్యవస్థీకరించే లక్ష్యాన్ని చేరడంలో ఒక చట్టం ఒంటరిగా విజయాన్ని సాధించే అవకాశం లేదు."

[15] దీపాంకర్ బసు, “పొలిటికల్ ఎకానమీ ఆఫ్‘ మిడిల్‌నెస్ ’: పశ్చిమ బెంగాల్‌లో గ్రామీణ హింస వెనుక”, ఇపిడబ్ల్యు, ఏప్రిల్ 21, 2001. పశ్చిమ బెంగాల్‌లో పంటపాలు విధానం (షేర్‌క్రాపింగ్ ) కింద ఉన్న మొత్తం భూమి వ్యవసాయ యోగ్యమైన భూమిలో 18-22 శాతం ఉంటుందని అంచనా; వ్యవసాయ యోగ్యమైన భూమిలో 8.2 శాతానికి చెందిన పంట పాలుదార్లు (షేర్ క్రాపర్లు) మాత్రమే నమోదయ్యారు. పశ్చిమ బెంగాల్ మానవ అభివృద్ధి నివేదిక 2004, పేజీలు 31-32.

[16] స్టెఫాన్ గ్రానెర్ - “Hernando de Soto and the mystification of capital” ( హెర్నాండో డి సోటో పెట్టుబడి మాయాజాలం), Eurozine, January 2007,https://www.eurozine.com/hernando-de-soto-and-the-mystification-of-capital/

[17] హెర్నాండో డి సోటో, ది మిస్టరీ ఆఫ్ కాపిటల్: పెట్టుబడిదారీవిధానం పశ్చిమదేశాల్లో ఎందుకు విజయ సాధించింది, మిగిలిన అన్ని చోట్ల ఎందుకు వైఫల్యం చెందింది. పేజి: 165.

[18] ఐబిడ్., పేజి: 41. ఈ లెక్కలు ప్రశ్నార్థకమైన పరిశోధన పద్ధతిపై ఆధారపడి ఉంటాయి, వీటిని మనం ఇక్కడ పేర్కొనలేము.

[19] ఐబిడ్., పేజి: 173.

[20] డి సోటో, op. cit., పేజి: 168.

[21] స్టెఫాన్ గ్రానెర్, op. cit.